క్లుప్తంగా

సురక్షితమైన నీరు అందించడమే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్



భగీరథ నీటిని పరీక్షిస్తున్న కమిషనర్ ఖాజామొయిజుద్దీన్

మొయినాబాద్: ప్రజలకు సురక్షితమైన మంచి నీరు అందించడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో సోమవారం భగీరథ నీటికి క్లోరినేషన్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నల్లా నీరు శుభ్రంగా వస్తుందో లేదో ఎప్పటికప్పుడూ గమనించాలని సూచించారు. తడి, పొడి చెత్త వేరువేరుగా వేయాలని ఇంటింటికీ తిరిగి ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు కృషి చేయాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో పిచ్చిమొక్కలు తొలగించేందుకు గ్రామ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింలు రూ.5 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయసింహ, ఏఎంసీ డైరెక్టర్ సంతోష్‌కుమార్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, కలాం తదితరులు ఉన్నారు.

కరాటే టోర్నీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్: సౌత్ ఇండియా నేషనల్ కరాటే టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 12న పట్టణంలో కరాటే టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య, నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోనే విక్రయాలు జరగాలి

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోహన్



మాట్లాడుతున్న మోహన్

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో పండిన పంటలకు సంబంధించి విక్రయాలు మన మార్కెట్‌లోనే జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి మోహన్ అన్నారు. సోమవారం ఆయన అధ్యక్షతన మార్కెట్ కార్యాలయ ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టాల్లో ఉన్న మార్కెట్‌ను లాభాల్లోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పంటలు అమ్ముకునేందుకు మార్కెట్‌కి వచ్చిన రైతుకు ఎక్కడ అసౌకర్యం కలగకుండా, అన్ని రకాలు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో మార్కెట్ సెక్రటరీ ఐశ్వర్యలక్ష్మి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓట్లను ఒకే వార్డులో ఉంచాలని వినతి

చేవెళ్ల: మున్సిపల్ పరిధిలోని ఇబ్రహీంపల్లి వార్డులో ఓట్లను చీల్చవద్దని, ఒకే వార్డుగా ఉండేలా చూడాలని వార్డు సభ్యులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పూర్ణచందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీగా కొనసాగిన ఇబ్రహీంపల్లిలో 1000 ఓట్లు ఉన్నాయని, తమ ఓట్లను మున్సిపాలిటీలో కూడా ఒకే వార్డు కింద ఉంచాలని సరిపడకపోతే పక్కనే ఉన్న చేవెళ్ల పరిధిలోని ఓట్లతో కలుపాలన్నారు. అలాకాకుండా అటు రామన్నగూడతో ఇటు చేవెళ్ల రెండు వార్డుల్లో కలిపి ఇబ్రహీంపల్లి ఓటర్లను మూడు ముక్కలు చేయొద్దని కోరారు. దీనిపై అధికారులు స్పందించి ఒకే వార్డు పరిధిలో ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, గ్రామ పెద్దలు సాయిలు, బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, దర్శన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, దాతర్, ఉస్మాన్, ఎండీ చాన్‌పాషా, ప్రశాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.



కొడిచర్ల రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు



సిద్ధాపూర్-కోళ్లపడకల్ రోడ్డులో మలుపువద్ద పెరిగిన చెట్లు

గ్రామీణ రోడ్లకు నిర్వహణ కరువు

- ఇరువైపులా పెరిగిన కంప చెట్లు
- మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కొత్తూరు: రోడ్డు సౌకర్యం బాగుంటేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తాయి. ఆస్పత్రులు, ఇతర అత్యవసర సమయాల్లో గ్రామాల నుంచి పట్టణాలకు చేరుకోవడానికి కూడా రోడ్డు సౌకర్యం చాలా అవసరం. కాగా కొన్నేళ్ల నుంచి గ్రామీణ రోడ్లకు కనీస మరమ్మతులు కరువయ్యాయి. దానికి తోడు రోడ్లకు ఇరువైపులా చెట్లు పెరిగి రోడ్డు విస్తీర్ణం తగ్గిపోయింది. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదు. కొన్ని గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. వాటికి తోడు చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

తగ్గుతున్న రోడ్ల విస్తీర్ణం..

మండలంలో 12 గ్రామ పంచాయతీలు 18 అనుబంధ గ్రామాలు, తండాలు ఉన్నాయి. మండలంలో పంచాయతీరాజ్ పరిధిలో 55.29 కిలోమీటర్ల మేర బీటీ, 10.07 సీసీరోడ్లు, మరో 15.62 కిలోమీటర్ల మేర మెటల్‌రోడ్లు ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో సుమారు 43 కిలోమీటర్ల మేర బీటీరోడ్లు ఉన్నాయి. కాగా రూ.కోట్లతో గ్రామాలు, పట్టణాలకు వేసిన రోడ్లకు ఏళ్లుగా నిర్వహణ లేదు. దీంతో రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు, మట్టి పేరుకుపోయింది. వీటి కారణంగా రోడ్ల విస్తీర్ణం చాలావరకు తగ్గిపోయింది. ఎదురెదురుగా వాహనాలు వచ్చే క్రమంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో కంప చెట్ల కారణంగా ద్విచక్ర వాహనదారులు గాయపడుతున్నారు.

నిర్వహణ పట్టని అధికారులు

ఎన్నో ఆందోళనలు, వినతుల మధ్యన ఆయా గ్రామాలకు అధికారులు, పాలకులు రోడ్లను మంజూరు చేస్తున్నారు. కాగా రోడ్ల ఏర్పాటు తర్వాత సంబంధిత శాఖల అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. కొత్తూరు-సిద్ధాపూర్, జేపీదర్గా-కొత్తూరు, తిమ్మాపూర్ రైల్వేస్టేషన్-జాతీయ రహదారితో పాటు పలు రోడ్లకు ఇరువైపులా చెట్లు పెరిగాయి. దీనికి తోడు వర్షానికి మట్టి పేరుకుపోయి వెడల్పు తగ్గుతోంది. ఇరుకుగా మారిన రోడ్ల కారణంగా వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

కంప చెట్లను తొలగించాలి

ప్రతి సంవత్సరం అధికారులు రోడ్ల పక్కన పెరిగిన కంప చెట్లను తొలగించడంతో పాటు వర్షాల కారణంగా పేరుకుపోయిన మట్టిని తీసివేయాలి. వీటి కారణంగా రోడ్ల వెడల్పు తగ్గడంతో పాటు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.



– రవీందర్‌రెడ్డి, సిద్ధాపూర్

పంచాయతీలదే బాధ్యత

పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రోడ్ల నిర్వహణకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు మంజూరు కావు. మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్ల నిర్వహణ బాధ్యత సంబంధిత గ్రామ పంచాయతీలదే. ప్రజాప్రతినిధులు రోడ్లకు అడ్డుగా వచ్చిన చెట్లు, కొమ్మలను తొలగించాలి.



–హేమంత్, పంచాయతీరాజ్ ఏఈ

మెనూ అమలులో నిర్లక్ష్యం వద్దు

ఎంఈఓ అంగూర్‌నాయక్



మధ్యాహ్న భోజన పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ అంగూర్‌నాయక్

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ రూపొందించిన మధ్యాహ్న భోజన పథకం మెనూను తప్పకుండా అమలు చేయాలని మండల విద్యాధికారి అంగూర్‌నాయక్ వంట ఏజెన్సీ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల భవనంలో ఆయన సోమవారం సీసీహెచ్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే ఆహారం పూర్తి నాణ్యతగా ఉండాలన్నారు. అంతేకాకుండా వంట గదులు, పాత్రలు ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు చదువుతో పాటు పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందుకే ఒకే రకమైన ఆహారం కాకుండా వివిధ కూరగాయలు, గుడ్లు, తదితర ఆహారాన్ని అందించేందుకు మెనూను తయారు చేసినట్లు వెల్లడించారు. అన్ని పాఠశాలల్లో తాజా కూరగాయలు వాడి మెనూ తప్పకుండా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీసీహెచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

బీఆర్ఎస్ సీనియర్ నేత సత్యనారాయణ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సత్యనారాయణ

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మె సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన ఎర్ర శ్రీకాంత్, జామకాయల శివ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా గెలుపొందిన ప్రథమ జట్టుకు రూ.15వేలు, ద్వితీయ జట్టుకు రూ.10వేల నగదు షీల్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి అనుకున్న లక్ష్యాలను ఛేదించడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. తనవంతుగా క్రీడాకారులకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డె బాలయ్య, నర్సింహ, ముకుందరెడ్డి, శ్రీశైలం, అజయ్, కృష్ణయ్య, కేశవ్‌రాజు, కోటయ్య, కన్నయ్య, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్



ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న నాయకులు

నందిగామ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ శివారులో ఈదుల ఎల్లమ్మ ఆలయ ఆవరణలో సోమవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ అధ్యక్షతన మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి బీజేపీ కార్యకర్త మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. రాబోయే యోగా దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున నిర్వహించాలని, దీన్ దయాల్ బలిదాన్ దివాస్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం తల్లికి వందనం పేరుతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌గౌడ్, నర్సింహగౌడ్, కృష్ణ మోహన్, అశోక్, మల్లేశ్, సాగర్, శ్రీశైలం, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, నాయకులు

కేశంపేట: బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని లేమామిడి, నిర్దవెళ్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తరగతి గదులు విశాలంగా ఉంటాయని, క్రీడల కోసం ఆటస్థలాలు, ఉచితంగా పాఠ్య పుస్తకాలను, యూనిఫామ్‌లు అందుతాయని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వినీత్‌గౌడ్, కార్యదర్శులు విజయ్, అరుణ్, ఉపాధ్యాయులు అరుణ, కృష్ణయ్య, రజిత, పూజ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని వినతి

శంకర్‌పల్లి: పంచాయతీ కార్యదర్శులకు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ వెంకయ్యకు వినతిపత్రం అందించారు. అనంతరం శంకర్‌పల్లి సంఘం మండల అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు ట్రెజరీలో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఓపీఎస్‌గా పని చేస్తున్న కార్యదర్శులను జేపీఎస్‌గా మార్చాలని కోరారు. అదేవిధంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగేళ్ల విధి నిర్వహణ కాలాన్ని సర్వీస్‌గా పరిగణించాలని, రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా స్పందించి, తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్‌ల కోసం ధర్నా

చేవెళ్ల: పట్టణంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల ఎదుట ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్ కోసం సోమవారం డాక్టర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, పీజీలు పూర్తి చేసుకున్న డాక్టర్లకు ఏడాది పాటు అందించే వైద్యసేవలకు గాను ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్‌లను అన్ని కళాశాలలు అందిస్తాయన్నారు. గత ఏడు నెలలుగా ఈ స్కాలర్‌షిప్‌లు రావటం లేదన్నారు. యాజమాన్యాన్ని ఎన్నిసార్లు అడిగినా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తూ వస్తోందన్నారు. యాజామాన్యం వెంటనే స్పందించి ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్‌లను అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి

ఎంవీఐ వాసు



బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ వాసు

షాద్‌నగర్: ప్రైవేట్ పాఠశాలల బస్సులకు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని ఎంవీఐ వాసు అన్నారు. సోమవారం పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సులకు రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు తెరిచే సమయం దగ్గర పడుతుండడంతో యాజమాన్యాలు విధిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విద్యాసంస్థల బస్సులు విధిగా పసుపు రంగులోనే ఉండాలని, డ్రైవర్‌కు విధిగా హెవీ వెహికిల్ లైసెన్సు ఉండాలని సూచించారు. డ్రైవర్ వయస్సు 60 ఏళ్లలోపు ఉండాలని, బస్సు నడిపేందుకు ఐదేళ్ల అనుభవం కావాలని సూచించారు. బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, మంటలను ఆర్పే వ్యవస్థ ఉండాలన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్



మొయినాబాద్‌రూరల్: లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల సర్టిఫికెట్లు అందించడంతో పాటు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్‌తోనే నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ అన్నారు. సోమవారం పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్యతో కలిసి ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, నాయకులు ఖాదీర్, శంకర్, నరేశ్, చంద్రశేఖర్‌అప్ప, చందూలాల్, తార, సందీప్, సాయి, వెంకటేశ్, రవి దితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

కొందుర్గు: ప్రభుత్వం ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు కావలి రాజు అన్నారు. మండలంలోని గుర్రంపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేయడంతో పాటు ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్



భజన మండలికి విరాళం అందిస్తున్న రాజేశ్‌పటేల్

కొందుర్గు: మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చిరుతల రామాయణం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన భజన మండలికి రూ.25వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, ఇస్తారమ్మ, మానయ్య, వేణుగోపాల్, సాయి, సచిన్, నర్సింలు, మల్లేశ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్



హైతాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న చంద్రశేఖర్, ఉపాధ్యాయులు

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ విద్య అందుతుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సర్కారు బడుల్లో నాణ్యమైన, విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ బడులను కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, నాయకులు తదితరులు ఉన్నారు.

మన ఊరి బడిలో చేర్పుదాం

మన పిల్లలను మన ఊరి ప్రభుత్వ బడిలో చేర్పిద్దామని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండలం పరిధిలోని బొబ్బిలిగామ, కేశవగూడ గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడి బయట ఉన్న చిన్నారులందరినీ బడిలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం యూనిఫాం, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు, పాఠశాల చైర్మన్ నర్సమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

భూభారతితో సమస్యల పరిష్కారం

ఆర్డీఓ చంద్రకళ



చేవెళ్ల: రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య



నందిగామలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చేవెళ్ల: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని గుండాల, రేగడిఘనాపూర్ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. గుండాలలో జరుగుతున్న సదస్సును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, నయాబ్ తహసీల్దార్ రాజేందర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నందిగామ: రెవెన్యూ సదస్సులను రైతులు, భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేశ్వర్, ఎంపీడీఓ సుమతి తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డిపల్లిలో 70 అర్జీల స్వీకరణ

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 70 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కేశంపేట: భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అజాంఅలీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దత్తాయపల్లి, చింతకుంటపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. దత్తాయపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. దత్తాయపల్లిలో 08, చింతకుంటపల్లిలో 06 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నాయబ్ తహసీల్దార్ గీత, ఆర్ఐ చెన్నకేశవులు, నిహారిక, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చందనవెల్లిలో..

షాబాద్: మండల పరిధిలోని చందనవెల్లి, మన్‌మర్రి గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

మొయినాబాద్: భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చందానగర్‌లో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామంలో మొత్తం 10 అర్జీలు వచ్చాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.